
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
శుక్రవారం 23 మే 2025



పోలీస్ కస్టడీకి సిరాజ్, సమీర్

పేలుళ్ల కుట్ర కేసు నిందితులు ఏ1 సిరాజ్, ఏ2 సమీర్‌ల నుంచి మరింత సమాచారాన్ని రాబట్టేందుకు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని టూటౌన్ పోలీస్‌లు న్యాయస్థానంలో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. రెండు రోజుల పాటు వాదనలు విన్న తరువాత సిరాజ్, సమీర్‌లను ఏడు రోజులు కస్టడీకి ఇస్తూ విజయనగరం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో శుక్రవారం నిందితులను జైలునుంచి విజయనగరం తీసుకురానున్నారు. సిరాజ్, సమీర్‌ల పోలీస్ కస్టడీతో మరిన్ని కీలక ఆధారాలు బయట పడే అవకాశం ఉంది. వారితో సీన్ రికన్‌స్ట్రక్షన్ చేస్తారని కూడా సమాచారం.

జన్మనిచ్చిన గడ్డపైనే పేలుళ్లకు కుట్ర?





- గుర్తించకపోయి ఉంటే భారీ నష్టమే!
- మూడు నెలలుగా నగరంపై కౌంటర్ ఇంటిలిజెన్స్ నిఘా
- కొనసాగుతున్న ఎన్ఐఏ దర్యాప్తు
- రంగంలోకి యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ ?
- నేడు పోలీస్ కస్టడీకి ఎ1 సిరాజ్, ఎ2 సమీర్

విజయనగరం/క్రైం మే 22 (ఆంధ్రజ్యోతి): ఊపిరి పోసుకున్న నేలపైనే రక్తపుటేర్లు పారించాలని చూశాడా? జన్మనిచ్చిన స్థలంలోనే అమాయక ప్రజల మృత్యుఘోషను వినాలనుకున్నాడా? విజయనగరంలో భారీ పేలుళ్ల కుట్రను ఛేదించి ఉండకుంటే పెనునష్టం సంభవించి ఉండేదా? ఎఫ్ఐఆర్ నివేదిక పరిశీలిస్తే ఈ ప్రశ్నలన్నీ నిజమేనన్న భావన కలగకమానదు. మతోన్మాదంతో నిందితుడు సిరాజ్ పెద్ద కుట్రే పన్నినట్లు అనుమానాలున్నాయి. ఈ నెల 21,22 తేదీల్లో పేలుళ్లకు పక్కా ప్రణాళిక వేసినట్టు పోలీస్‌లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. గగుర్పాటు కలిగించే అంశాలు బయటపడడంతో జిల్లా వాసులు ఉలిక్కిపడుతున్నారు.

విజయనగరం వాసి సిరాజ్ కదలికలపై ఆంధ్రా, తెలంగాణ కౌంటర్ ఇంటిలిజెన్స్ అధికారులు గత ఆరు నెలలుగా ప్రత్యేక నిఘా పెట్టారు. అలాగే ఎన్ఐఏ అధికారులు ఇచ్చిన సమాచారంతో మూడునెలలుగా కౌంటర్ ఇంటిలిజెన్స్ అధికారులు జిల్లా కేంద్రంలోనే ఉంటూ సిరాజ్‌పై డేగ కన్నుతో పరిశీలిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో పేలుళ్లకు కుట్రలు పన్నినట్లు నిర్ధారణకు వచ్చి తరచూ జిల్లా పోలీస్ ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నారు. స్థానిక పోలీసుల సహకారంతో ఈ నెల 16న సిరాజ్‌ను వల వేసి పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించటంతో పోలీసు అధికారులకు విస్తుపోయే (మిగతా 8వ పేజీలో..)

రంగంలోకి యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్?

పేలుళ్ల కుట్రలో దర్యాప్తు మరింత వేగవంతం చేసేందుకు యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్)రంగంలోకి దిగినట్లు సమాచారం. టెర్రరిస్టుల మూలాలు, వారి కార్యకలాపాలు వెలికితీయడంలో ఈ విభాగం అత్యంత కీలకంగా వ్యవహరిస్తుంది.

లాకర్‌ను తెరిచేందుకు ప్రయత్నం

సిరాజ్ పేరున అనేక బ్యాంక్ అకౌంట్‌లు ఉన్నట్లు తెలిసిందే.. జిల్లా కేంద్రంలోని డీసీసీబీలో సిరాజ్ పేరున అకౌంట్ ఉండగా తండ్రి పేరున లాకర్ ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. సిరాజ్‌ను రిమాండ్‌కు తరలించిన తరువాత ఆయన తండ్రి లాకర్ ఓపెన్ చేసేందుకు విఫలయత్నం చేశారు. ఇంతలా లాకర్ ఓపెన్ చేసేందుకు ఎందుకు ఆరాట పడుతున్నాడు..ఇంతకీ ఆ లాకర్‌లో ఏముంది.. అన్న ప్రశ్నలు పోలీసులు, ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి. కుటుంబ సభ్యులకు చెందిన బ్యాంక్ ఖాతాల్లో లావాదేవీలను ఆర్‌బీఐ ఆదేశాలతో నిలిపివేసినట్లు సమాచారం.



PMEGP
Prime Minister's Employment Generation Programme

నిరుద్యోగుల్లో నిరాశ



- పీఎంఈజీపీ రుణాలు మంజూరు చేసినా విడుదల కాని రాయితీలు
- ఏడాదిగా ఎదురుచూపులు
- పీఎం విశ్వకర్మ పథకం రుణాలు మంజూరు కాని వైనం
- బీసీ కార్పొరేషన్ రుణాలకూ ఇవ్వని రాయితీ

విజయనగరం కలెక్టరేట్, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలు మంజూరు కావడం లేదు. మంజూరైనా నిధులు విడుదల చేయడం లేదు. స్వయం ఉపాధిలో ముఖ్య భూమిక వహించే ఈ రుణాల పరిస్థితి అయోమయంగా మారడంతో వారంతా నిరాశ పడుతున్నారు. ఉపాధికి భరోసా లేకపోయిందని ఆవేదన చెందుతున్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ)కింద 2024-2025 సంవత్సరానికి సంబంధించి 2050 యూనిట్లు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 749 మంది దరఖాస్తు చేసుసుకున్నారు. 187 దరఖాస్తులు బ్యాంకు వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. 100 దరఖాస్తులు ఏజెన్సీల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. బ్యాంకర్లు 259 యూనిట్లు మంజూరు చేశారు. వాటిల్లో తొలుత 150 మందికి రాయితీ కోసం ప్రతిపాదించారు. ఐదుగురికి మాత్రమే రాయితీ విడుదల చేశారు. మిగిలినవారు బ్యాంకు రుణాలు చెల్లించుకోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉండగా పీఎం విశ్వకర్మ పథకం కింద జిల్లా వ్యాప్తంగా 86,386 మంది నుంచి దరఖాస్తులు వచ్చాయి. వీటిని మూడు దశల్లో పరిశీలించారు. ఇప్పటి వరకూ కేవలం 1080 మందికి మాత్రమే రుణాలు (మిగతా 8వ పేజీలో..)

- గంట్యాడ మండలం చంద్రంపేటకు చెందిన ఓ యువకుడు ఏడాదినర్న క్రితం పీఎంఈజీపీ పథకం ద్వారా రూ2లక్షలు రుణం తీసుకున్నాడు. లక్షకు రూ.35 వేలు చొప్పున రాయితీ ఇవ్వాల్సి ఉంది. బ్యాంకు తీసుకున్న రుణానికి ప్రతి నెలా అప్పు చెల్లిస్తున్నాడు కాని ప్రభుత్వం నుంచి నేటికీ రాయితీ డబ్బులు పడలేదు.

- విజయనగరం కొత్తపేట యాదవవీధికి చెందిన ఓ యువకుడు బీసీ కార్పొరేషన్ రుణం కోరుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. బ్యాంకు వారు అడిగిన డాక్యుమెంట్లు అన్నీ ఇచ్చాడు. సిబిల్ స్కోరు కూడా బాగుంది. రుణం మంజూరు చేస్తామని బ్యాంకు అధికారులు హామీ ఇచ్చారు. లేథ్‌మిషన్ (యూనిట్)కు కొటేషన్ కూడా తీసుకువచ్చి బ్యాంకుకు ఇచ్చాడు. అయితే ఇవన్నీ జాగ్రత్తగా మీ దగ్గరే ఉంచుకోవాలని, ప్రభుత్వం నుంచి సబ్సిడీ ఇంకా బ్యాంకులకు చేరలేదని, బ్యాంకుకు చేరిన వెంటనే సమాచారం ఇస్తామని చెప్పడంతో ఆ యువకుడు ఖంగుతిన్నాడు.



శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని సబ్బవరం-కొత్తవలస- కె.కోటపాడు రోడ్డుది. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉంది. కొత్తవలస మండల కేంద్రం నుంచి సబ్బవరం మీదుగా అనకాపల్లికి దగ్గర దారి. అదే విధంగా కె.కోటపాడు మీదుగా దేవరాపల్లి, చోడవరం వెళ్లేందుకు అనుకూలం. ఈ రోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు చాలా కాలం నుంచి రహదారిని మెరుగుపరచాలని కోరుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అనేక పర్యాయాలు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రయోజనం లేకపోయింది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈ రోడ్డును అభివృద్ధి చేసేందుకు టీడీపీ హామీ ఇచ్చింది. ఈమేరకు రూ.3.20 కోట్ల నాబార్డు నిధులను ప్రభుత్వం కేటాయించింది.

- మారనున్న ఆర్‌అండ్‌బీ రహదారులు
- రూ.13.85 కోట్ల నాబార్డు నిధులు విడుదల
- ఆరు ప్రధాన రోడ్లకు కేటాయించిన ప్రభుత్వం
- సబ్బవరం-కొత్తవలస- కె.కోటపాడు రహదారికి రూ.3.20కోట్లు

రోడ్లకు కొత్త రూపు

శృంగవరపుకోట, మే 22(ఆంధ్రజ్యోతి): రోడ్లు,భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ)కు చెందిన ఆరు రహదారులు జిల్లాలో మెరుగుపడ నున్నాయి. వీటిని బాగు చేసేందుకు నాబార్డు ఆర్ఐడీఎఫ్ నుంచి రూ.13.85 కోట్లు విడుదల చేశారు. పరిపాలన అనుమతులతో కూడిన ఉత్తర్వులను ఇటీవల రోడ్లు, భవనాల శాఖ జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 191 ఆర్‌అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేసేందుకు రూ.400 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది. దీంతో ఎక్కడికక్కడ పాడయ్యాయి. కొన్ని అభివృద్ధి పేరుతో తవ్వి వదిలేసింది. పనిచేసిన కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వక వారు మధ్యలో పనులు (మిగతా 8వ పేజీలో..)

జిల్లాలో నాబార్డు నిధులతో మెరుగుపడనున్న ఆర్‌అండ్‌బీ రోడ్లు

రోడ్డు పేరు	కిలోమీటర్లు	నిధులు రూ.కోట్లలో
విజయనగరం-భోగాపురం	7.000	1.75
పినపెంకి-ఆకులకట్ట	8.253	2.90
రాజీవ్‌బొమ్మ - పాలకొండ కూడలి	4.548	3.00
కొంపంగి వయా పోరం, జక్కువ	3.400	1.80
కొండలింగాలవలస వయా ఎమ్‌వలస	6.000	1.20
సబ్బవరం-కొత్తవలస-కె.కోటపాడు	13.400	3.20

ఆనందంగా ఉంది

ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోంది. నా నియోజకవర్గ పరిధిలోని కొత్తవలస నుంచి సబ్బవరం-కె.కోటపాడు వరకు ఉన్న రోడ్డుకు నాబార్డు నిధులు అందించడం ఆనందంగా ఉంది. చొరవ తీసుకున్న సీఎం నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు.

- కోళ్ల లలితకుమారి, శాసన సభ్యురాలు, శృంగవరపుకోట

మేల్కొంటే మంచిది

- జిల్లాలో అక్కడక్కడ జ్వరాల కేసులు
- వాతావరణం మారడమే కారణం
- వైద్యాధికారుల్లో కానరాని ముందస్తు సన్నద్ధత
- దృష్టిపెట్టాలని ఇన్‌చార్జి మంత్రి అనిత ఆదేశం

6 లో



బియ్యం బండి.. ఖజానాకు గండి

- జిల్లాలో ఎండీయూ వాహనాలు 348
- ఒక్కో వాహనానికి నెలకు రూ.21 వేలు
- ఏడాదికి దాదాపు రూ.9 కోట్లు
- 2021 ఫిబ్రవరి నుంచి చెల్లింపులు
- ఇప్పటివరకూ సుమారు రూ.50 కోట్లు వ్యయం

6 లో



వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

6 లో



ఎయిర్ పోర్టుకు మరో 500 ఎకరాలు

6

పనితీరు ఆధారంగానే బదిలీలు

- సిఫారసు చేయించిన వారిపై చర్యలు
- భూ ఆక్రమణదారులతో దరఖాస్తు చేయించండి
- రెవెన్యూ అధికారులతో కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, మే 22(ఆంధ్రజ్యోతి): సమర్థత, పనితీరు ఆధారంగానే బదిలీలు చేస్తామని, ఎటువంటి సిఫారసులను ఆమోదించబోమని కలెక్టర్ అంబేడ్కర్ స్పష్టంచేశారు. కేవలం పనితీరే చూస్తామని, సిఫారసు చేయించిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల రెవెన్యూ అధికారులతో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, అందరికీ గృహాలు, ఇళ్ల స్థలాల రీవెరిఫికేషన్, వాటర్‌ట్యాక్స్, ఆన్‌లైన్ సర్వీసు పెండింగ్, రీసర్వే, పీజీఆర్ఎస్ వినతులపై ఆయన గురువారం సమీక్షించారు. ప్రతివారం సీసీఎల్ఏ సమీక్షలో మన జిల్లా రెవెన్యూ అంశాల్లో వెనుకబడి ఉంటోందని కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే వినతుల్లో 90శాతం వరకూ రెవెన్యూకు (మిగతా 8వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

ఆరేళ్లుగా ఎదురుచూపు!

- అగ్రిగోల్డ్ ఖాతాదారులకు చెల్లింపులు ఎప్పుడో?
- జిల్లాలో 1.50 లక్షల మంది బాధితులు

Agri Gold



రాజాం, మే 22(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ ఖాతాదారులు చెల్లింపులపై ఆశలు పెట్టుకున్నారు. తాము చెల్లించిన నగదు కోసం గత ఆరేళ్లుగా కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.50 లక్షల మంది అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్లు ఉన్నారు. 2019 ఎన్నికలకు ముందే అగ్రిగోల్డ్ సంస్థ బోర్డు తిప్పేసిన విషయం తెలిసిందే. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ అగ్రిగోల్డ్ బోర్డు తిప్పేయడం వెనుక అప్పటి టీడీపీ ప్రభుత్వం హస్తం ఉందని ఆరోపణలు చేశారు. తాము అధికారంలోకి వస్తే బాధితులకు చెల్లింపులు చేపడ్తామని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదు. దీంతో ఖాతాదారులు, ఏజెంట్లు ఆందోళనలు చేశారు. దీనికి స్పందనగా మొక్కుబడి చర్యలకు దిగింది. 2019, 2021లలో రెండు విడతల్లో రూ.10 వేలు, రూ.20 వేలలోపు బాండ్లు ఉన్న వారికి చెల్లింపులు చేశారు. ఈ విధంగా (మిగతా 8వ పేజీలో..)

వీధినపడ్డాం

కుటుంబ అవసరాల కోసం అగ్రిగోల్డ్‌లో డిపాజిట్ చేశాను. కానీ మా ఆశలను సంస్థ చిదిమేసింది. ఉన్నఫలంగా బోర్డు తిప్పేసింది. అధికారంలోకి వస్తే డిపాజిట్లు చెల్లిస్తామని జగన్ హామీ ఇచ్చారు. కానీ నిలబెట్టుకోలేకపోయారు. నా కుటుంబం వీధిన పడింది.

-అర్పిపల్లి సింహాచలం, అగ్రిగోల్డ్ బాధితుడు, రాజాం

హామీ అమలు కాలేదు

పిల్లల భవిష్యత్ కోసమని కష్టమంతా అగ్రిగోల్డ్‌లో పెట్టాం. కానీ ఆ సంస్థ మూతపడింది. ఆదుకుంటామని చెప్పిన నాటి సీఎం జగన్ హామీలకే పరిమితమయ్యారు. రూ.20 వేలలోపు చెల్లింపులు చేసినా మాకు పైసా దక్కలేదు. అసలు చెల్లిస్తారా? లేదా? అన్న సందేహంలో ఉన్నాం.

- చోడిశెట్టి శ్రీనివాసరావు, అగ్రిగోల్డ్ బాధితుడు, రాజాం

మేల్కొంటే మంచిది

- జిల్లాలో అక్కడక్కడ జ్వరాల కేసులు
- వాతావరణం మారడమే కారణం
- వైద్యాధికారుల్లో కానరాని ముందస్తు సన్నద్ధత
- దృష్టిపెట్టాలని ఇన్‌చార్జి మంత్రి అనిత ఆదేశం

రాజాం, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒక వైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు తొలకరి జల్లులు పడుతున్నాయి. వాతావరణంలో మార్పులతో జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పుడే వైద్యాధికారులు మేల్కొంటే ముందుముందు పరిస్థితి అదుపు తప్పదు. గత అనుభవాల దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుంటే మూల్యం చెల్లించుకోవడం ఖాయం. గత ఏడాది గుర్ల మండలంలో డయేరియా బారిన పడి చాలా మంది మృత్యువాత పడ్డారు. అలాంటి పరిస్థితి పునరావృతం కాకూడదు. సాధారణంగా వర్షాకాలం మొదలైతే జ్వరాలు విజృంభిస్తుంటాయి. అక్టోబరు వరకూ వ్యాధుల కాలంగా వైద్యులే చెబుతారు. మరి వీటిని ఎదుర్కొనేందుకు యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావడం లేదు.



చెరువు పరిసరాల్లో చెత్తా చెదారం

వైద్యసేవలు అంతంతమాత్రం..

విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రితో పాటు బొబ్బిలి, రాజాంలో 100 పడకల ఆస్పత్రులు ఉన్నాయి. వీటితో పాటు 50కుపైగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 10 వరకూ సీహెచ్‌సీలు, 300 వరకూ ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సంతృప్తికరంగా వైద్యసేవలు అందక రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇటీవలే జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత వైద్య, ఆరోగ్య శాఖల పనితీరుపై కీలక సూచనలు చేశారు. వ్యాధుల సీజన్‌లో ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు రాకుండా ఇప్పటినుంచే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరోవైపు జిల్లాలో వ్యాధులు ముసురుకుంటున్నాయి. వారం రోజులుగా ఆస్పత్రుల్లో జ్వరాల కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ఏటా వర్షాకాలం నాటికి వైద్యారోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టేది. ఈ ఏడాది ఆ ప్రణాళిక కొరవడింది. దీనికితోడు గ్రామాల్లో పారిశుధ్య పనులు నిలిచిపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ తూతూ మంత్రపు చర్యలకే పరిమితమవుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏటా వర్షాకాలంలో ముందస్తుగా సీజనల్ వ్యాధులు ఎదుర్కొవడంపై ప్రణాళిక సిద్ధం చేసేవారు. ప్రమాదకర జ్వరాలు, వ్యాధుల నియంత్రణకు ఎలా ముందుకెళ్లాలి అన్నదానిపై ఉన్నతస్థాయిలో సమీక్షించేవారు. ఆస్పత్రుల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచేవారు. ఆస్పత్రి సలహా మండలి సమావేశాలు నిర్వహించేవారు. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. ఎక్కడా సన్నద్ధత అనేది కనిపించడం లేదు.

డెంగ్యూ నిర్ధారణకు ప్రామాణికం ఏదీ?

గత ఏడాది జిల్లాలో డెంగ్యూ జ్వరాలు ఆందోళనకు గురిచేశాయి. ఈ జ్వరాల నిర్ధారణలో దోపిడీ కొనసాగుతోందన్న విమర్శలున్నాయి. డెంగ్యూ నిర్ధారణ విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దిష్టమైన సూచనలు చేసింది. ఆ ప్రకారం ర్యాపిడ్ పరీక్షల ద్వారా డెంగ్యూ నిర్ధారణ అయిన తరువాతే చికిత్స అందించాలి. వైద్య ఆరోగ్యశాఖ కూడా ర్యాపిడ్ పరీక్షలను పరిగణనలోకి తీసుకోమని చెబుతోంది. అయితే నిర్ధారణ ఆలస్యం కావడంతో రోగి ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి. ఎలిషా పరీక్ష తరువాతే రోగికి వైద్యసేవలందిస్తామని ప్రభుత్వ వైద్యులు చెబుతున్నారు. ఎలిషా పరీక్షకు సంబంధించి పీహెచ్‌సీల్లో ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. మన జిల్లాకు సంబంధించి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మాత్రమే ఎలీషా పరీక్షలు జరుగుతున్నాయి. దీంతో వైద్యసేవల్లో జాప్యం జరుగుతోంది. జిల్లాలోని ఎంపిక చేసిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలీషా పరీక్షలు జరిగేలా చూడాల్సిన అవసరం ఉంది.



జిల్లా కేంద్రాసుపత్రి

మెరుగైన సేవలందిస్తున్నాం

రోగులకు మెరుగైన సేవలందిస్తున్నాం. ఆస్పత్రుల్లో వసతులు మెరుగుపరుస్తున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే అన్ని ఆస్పత్రుల్లో మందులు అందు బాటులో ఉంచాం. ప్రజలు పరిశుభ్రతను పాటించాలి. వేడి నీటినే తాగాలి. వంట పదార్థాలపై మూతలు వేయాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవు.

- జీవనరాణి, డీఎంహెచ్‌వో, విజయనగరం

పారిశుధ్య లోపం..

ప్రధానంగా పారిశుధ్యం లోపించిన ప్రాంతాల్లోనే జ్వరాలు వెలుగుచూస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా విజయనగరం కార్పొరేషన్, బొబ్బిలి, రాజాం మునిసిపాల్టీలు, మేజర్ పంచాయతీల పరిధిలో జ్వరాలు వెలుగుచూస్తున్నాయి. గ్రామాల్లో సైతం పారిశుధ్యం అంతంతమాత్రం. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేసింది. ఆర్థిక సంఘం నిధులను పెద్ద ఎత్తున విడుదల చేసింది. అయినా సరే గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదు. దీనికి కారణాలు లేకపోలేదు. పంచాయతీల్లో ఇప్పటికీ వైసీపీ సర్పంచ్‌లే ఉన్నారు. వారు పనులు చేయించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శ ఉంది. ఏదైనాగాని జిల్లా యంత్రాంగం గత అనుభవాల దృష్ట్యా వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

ఎయిర్‌పోర్టుకు 500 ఎకరాల కేటాయింపు

- గడువుకు ముందే పనుల పూర్తికి చర్యలు



నిర్మాణం జరుగుతున్న ఎయిర్‌పోర్టు

భోగాపురం, మే22 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎయిర్‌పోర్టుకు అదనంగా మరో 500 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎయిర్‌పోర్టు సిటీ సైడ్ డెవలప్‌మెంట్ కోసం భూమిని కేటాయించారు. గతంలో ఎయిర్‌పోర్టు సుమారు 2703 ఎకరాలు తీసుకోగా అందులో సుమారు 2203 ఎకరాలను అప్పగించారు. ఇప్పుడు మిగిలిన 500 ఎకరాలను భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఏవియేషన్ హబ్ నిర్మాణంలో భాగంగా సిటీ సైడ్ డెవలప్‌మెంట్ కోసం కేటాయిస్తూ రాష్ట్ర కేబినెట్ ఇటీవల ఆమోదం తెలిపింది. మంత్రుల కమిటీ సిఫారుసుల మేరకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి భూ కేటాయింపునకు ఆమోదం తెలిపారు. ఎయిర్‌పోర్టుకు మాస్టర్ ప్లాన్ ప్రకారం 2703 ఎకరాలు కేటాయించాల్సి ఉన్నా వైసీపీ ప్రభుత్వం 2203 ఎకరాలు మాత్రమే విమానాశ్రయానికి కేటాయించింది. భవిషత్తు అవసరాలు, సిటీ సైడ్ డెవలప్‌మెంట్ కోసం 500 ఎకరాలను కేటాయిస్తూ కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే రూ.4,592 కోట్ల వ్యయంతో చేపట్టిన ఎయిర్‌పోర్టు పనులను కూటమి ప్రభుత్వం వాయువేగంతో కొనసాగిస్తోంది. గడువుకన్నా ముందే విమానాశ్రయ నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మొదటి దశలో 60 లక్షల మంది ప్రయాణించేందుకు వీలుగా సదుపాయాలు సమకూర్చనున్నారు. ఆ తర్వాత 4 కోట్ల మంది ప్రయాణికులకు సరిపోయేలా ఎయిర్‌పోర్టును తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. భారీ విమానాలు సైతం సులువుగా ల్యాండ్ అయ్యేందుకు 3.8 కిలోమీటర్ల పొడవైన రన్‌వేలు నిర్మిస్తున్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులపై ఎప్పటికప్పుడు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

బియ్యం బండి ఖజానాకు గండి!



- జిల్లాలో ఎండీయూ వాహనాలు 348
- ఒక్కో వాహనానికి నెలకు రూ.21 వేలు
- ఏడాదికి దాదాపు రూ.9 కోట్లు
- 2021 ఫిబ్రవరి నుంచి చెల్లింపులు
- ఇప్పటివరకూ సుమారు రూ.50 కోట్లు వ్యయం

రాజాం రూరల్/ నెల్లిమర్ల, మే 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రవేశపెట్టిన ఎండీయు(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాల ద్వారా బియ్యం పంపిణీ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. దశాబ్దాలుగా కొనసాగే డీలర్ల వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టనుంది. జూన్ 1 నుంచి రేషన్ డీలర్ల ద్వారా బియ్యం తదితర సరుకుల్ని కార్డుదారులకు అందించేందుకు వీలుగా చర్యలు ప్రారంభించింది. ఫలితంగా ప్రభుత్వానికి ఏడాదిలో రూ.8.76 కోట్లు ఆదా కానుంది. వాహనం ఎప్పుడొస్తుందో తెలియని సందిగ్ధత నుంచి ఎప్పుడైనా సరుకులు తీసుకునేలా కార్డుదారులకు వెసులుబాటు కల్పించే చర్యలకు శ్రీకారం చుట్టింది.

ఇంటింటికీ రేషన్ పంపిణీ అంటూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. 2021 ఫిబ్రవరి నుంచి ఎండీయు వాహనాలను ప్రవేశపెట్టింది. జిల్లాకు 370 వాహనాలు కేటాయించగా తాజాగా ప్రభుత్వం రద్దు చేసే సమయానికి జిల్లాలో 348 వాహనాలు పంపిణీ ప్రక్రియను కొనసాగిస్తున్నాయి. కాగా ఒక్కో వాహనానికి నెలకు రూ.21 వేలు వంతున నెలకు రూ.73.08 లక్షలు ఖర్చు కాగా ఏడాదికి రూ.8,7696000 ప్రభుత్వ ఖజానాపై భారం పడుతోంది. ఆపరేటర్‌కు నెలకు రూ.10 వేలు, పెట్రోల్‌కు రూ.3 వేలు, నెలవారీ ఈఎంఐ 3 వేలు, వాహనంలో పనిచేసే సహాయకుడికి రూ.5 వేలు వెచ్చించేవారు. ఈ లెక్కన వాహనాలను ప్రవేశపెట్టిన నాటి నుంచి మే నెల వరకూ సుమారు రూ.50 కోట్ల ప్రజాధనం ఖర్చు అయింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల నిధులను వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలను వైసీపీ నాయకులు, కార్యకర్తలకే కట్టబెట్టారు. ఒక్కో వాహనానికి రూ.6 లక్షలు విలువ కట్టారు. అందులో 10 శాతం లబ్ధిదారులు చెల్లించగా మిగిలిన మొత్తంలో కొంత రాయితీ పోను ఈఎంఐల రూపంలో చెల్లిస్తున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం ఆయా వాహనాలను ఎండియు వాపరేటర్లకు ఉచితంగా అందించనున్నారు.

డీలర్లలో ఆనందం..

రేషన్ డీలర్లలో ఆనందం వెల్లువిరుస్తోంది. వైసీ పీ ప్రభుత్వం డీలర్ల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పలుమార్లు పౌరసరఫరాల శాఖ మంత్రితో పాటు ముఖ్యమంత్రిని డీలర్లు కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని వివరించినా పట్టించుకోలేదు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం పాత విధానానికే మొగ్గు చూపింది. ఫలితంగా కార్డుదారుల్లో కూడా కొంతమేర ఊరట కలగ నుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.



కార్డుదారులకు అసౌకర్యం

ఎండీయు వాహనాల వల్ల కార్డుదారులకు తీవ్ర అసౌకర్యం కలిగేది. వాహన నిర్వాహకులు ఓ వీధి చివర్లో నిలిపి సరుకులు పంపిణీ చేసేవారు. గ్రామాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. అసలు వాహనం ఎక్కడ నిలిపేవారో బియ్యం కోసం వెళ్లి వచ్చినవారు చెబితే తప్ప తెలియని దుస్థితి. ఇదిలా ఉంటే ఎండీయు వాహనాలకు జీపీఎస్ అమర్చకపోవడంతో ఆ వాహనం ఎక్కడ తిరుగుతుందో, అసలు సరుకులు ఇస్తున్నారా, లేదా అనేది అధికారులకు సైతం తెలియని పరిస్థితి. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకే వాహనాలు కేటాయించడంతో గత ప్రభుత్వ హయాంలో ఆ వాహనాలు సరిగ్గా తిరుగుతున్నాయా, లేదా అనేది అధికారులు సైతం పట్టించుకునేవారు కాదు.

జై హనుమ.. జైజై హనుమ

నెల్లిమర్ల, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామి దేవస్థానంలో గురువారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా వైదిక సిబ్బంది దేవాలయంలో ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించారు. తర్వాత దేవస్థానంలోని ఆంజనేయస్వామి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అలంకరణ అనంతరం తమలపాకులు, సిందూరంతో పూజలు నిర్వ హించారు. అనంతరం సహస్ర నామార్చన చేశారు. ఈ వేడుకలు దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, అర్చకులు ఖండవిల్లి కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్, పవన్‌కుమార్ నిర్వహించారు. యాగశాలలో సుందరకాండ హవనం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రస్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు.

ఆకట్టుకునేలా..

రామతీర్థంలోని రామస్వామివారి దేవస్థానంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హనుమాన్ విగ్రహం ఎదుట జై శ్రీరామ్ అక్షర ఆకృతిలో దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు దివ్యానుభూతికి లోనయ్యారు.



దీపాలతో జైశ్రీరామ్ అక్షరాకృతిలో..



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

విజయనగరం రింగురోడ్డు, మే 22(ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ ధర్మరక్ష సమితి ఆధ్వర్యంలో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని రామాలయాలు, ఆంజనేయ ఆలయాల్లో, కోట జంక్షన్‌లో హనుమంతుడి విగ్రహానికి తమలపాకులు, సిందూరం, వివిధ రకాల పుష్పాలతోప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోట నుంచి మూడు లాంతర్లు, ఎంజీ రోడ్డు, కన్యాకాపరమేశ్వరి కోవెల, ఎన్‌సీఎస్ రోడ్డు మీదుగా కలెక్టరేట్, ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ శోభాయాత్ర కొనసాగింది. శోభయాత్రలో కళారూపాలు, కోలాటాలు, డప్పు వాయిద్యాల ప్రదర్శన జరిగింది. జెండాలు పట్టుకుని చిన్నారుల స్కేటింగ్ విన్యాసాలు చూపరులను అలరించాయి. ముఖ్యఅతిథులుగా ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి, సినీనటి కరాటే కల్యాణి, హిందూ ధర్మరక్ష సమితి ప్రతినిధులు ఎన్.వేణుగోపాలరావు, శ్యామ్‌సుందర్, పార్థసారధి, నరేష్, రాజేశ్, ముత్యాలనాయుడు, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి రూరల్: తారకరామా కాలనీలోగల హనుమాన్‌కు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



ఎస్.కోట పట్టణంలో బ్రాహ్మణవీధి రామాలయంలో..



గుర్ల: హనుమంతుడికి పూజలు



గరుగుబిల్లి: నాగూరులో పంచముఖాంజనేయస్వామి ఆలయంలో..



బొబ్బిలి రూరల్: పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్న హనుమాన్ దీక్షా సేవా సమితి సభ్యులు



పార్వతీపురం/ టౌన్: ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా పాదాలమ్మ పండుగ

లక్కవరపుకోట, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురంలో పాదాలమ్మతల్లి పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మ వారి ఘటాలను ఊరేగించారు. వారం రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనుపోత్సవాన్ని చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుష్ఠు రోగులపై వివక్ష తగదు

లక్కవరపుకోట (కొత్తవలస), మే 22(ఆంధ్రజ్యోతి): కుష్ఠు రోగులపై వివక్ష చూపరాదని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యుడు గోపాలకృష్ణ అన్నారు. గురువారం తుమ్మికాపల్లిలో కుష్ఠు వ్యాధిపై ఆయన అవగాహన కల్పించారు. శరీరంపై రాగివర్ణంలో మచ్చలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కుష్ఠు నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సిబ్బంది అందుబాటులో లేకుంటే చర్యలు

వంగర, మే 22 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో లేకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో ఎస్. రఘునాథ్ హెచ్చరించారు. గురువారం అరసాడ, మడ్డువలస, మగ్గూరు గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది హాజరు, వారి పనితీరు పరిశీలించారు. ప్రధానంగా పిబ్బంది సమయ పాలనపై తరుచు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సిబ్బంది పనితీరు మెరుగు పరచుకోవాలని హితవు పలికారు. అలాగే పంచాయతీల్లో చెత్తసంపద కేంద్రాల వినియోగానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

సాగునీటి కాలువకు మరమ్మతులు

వంగర, మే22 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస రిజర్వాయర్ ఎడమ కాలువ గట్టుపై పలుచోట్ల గండ్లు పడిన నేపథ్యంలో అధికారులు వాటి మరమ్మతులకు ఉపక్రమించారు. కాలువ గండ్లపై ఇటీవల రైతుల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు పనులను ప్రారంభించారు. ఖరీఫ్ ప్రారంభానికి ముందు కాలువలో పూడికలు తీయటానికి ప్రభుత్వం కొంతమేర నిధులు సమకూర్చిందని ఏఈ నితిన్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం, మే22(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ ఎస్.కె.మస్తాన్‌వలి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పోలిపల్లి, రాజాపులోవ, మహరాజుపేట, కొత్త చెరుకుపల్లి, పాత చెరుకుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

ఆలయానికి రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న చంద్రరావు

గజపతినగరం, మే22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూదేవిపేటలో నిర్మిస్తున్న ఆంజనేయ ఆలయానికి అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కనకల చంద్రరావు గురువారం రూ.50 వేల విరాళం ప్రకటించారు. సర్పంచ్ కనకల ప్రవీణ, ఉప సర్పంచ్, గ్రామ పెద్దల సమక్షంలో ఆ మొత్తాన్ని అందజేశారు. ఆలయానికి విరాళం అందజేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

పింఛన్లు మంజూరు చేయండి

నెల్లిమర్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): వితంతువులు, వృద్ధులకు తక్షణమే సామాజిక పింఛన్ మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు, సీపీఎం మండల కార్యదర్శి కిల్లంపల్లి రామారావు కోరారు. గురువారం వారు ఇన్‌చార్జి ఎంపీడీవో సుదర్శనంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా అర్హులకు పింఛన్లు మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. పింఛన్లు మంజూరు చేయకపోతే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమానికి సిద్ధమవుతామని వారు హెచ్చరించారు.

సారా నిర్మూలనకు భాగస్వాములుకండి

వంగర, మే 22 (ఆంధ్రజ్యోతి) గ్రామాల్లో సారా నిర్మూలనకు అందరూ భాగస్వాములు కావాలని రాజాం ఎక్సైజ్ సీఐ జైభీమ్‌రావు అన్నారు. నవోదయం-2లో భాగంగా గురువారం వీవీఆర్‌పేటలో ప్రజలకు అవగాహన కల్పించారు. సారాతో విలువైన జీవితాలు పోగొట్టుకోవద్దన్నారు. ఇంటి పెద్ద సారాకు బానిసైతే జరిగే పరిణామాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధానవీధిలో మానవహారం నిర్వహించి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకుడు ఎం.గంగారావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో సీఐ

రీసర్వే వినతులు పరిష్కరించండి

● పనితీరు ఆధారంగా బదిలీలు ● రెవెన్యూ సదస్సులో కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

శృంగవరపుకోట రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రీసర్వే వినతులను వారం రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ అంబేడ్కర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చాలావరకు అధికారులు, సిబ్బంది అర్జీలను డిస్పోజ్ చేస్తున్నారు తప్ప.. పరిష్కారంలో చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే గ్రీవెన్స్‌కు 90 శాతం అర్జీలు రెవెన్యూ సమస్యలపై వస్తున్నాయన్నారు. వాటి సంఖ్య చూస్తుంటే కారణం ఎవరో తెలుస్తోందన్నారు. అలాగే నియోజకవర్గంలో ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ, అందరికీ గృహాలు, ఇళ్ల స్థలాల రీ-వెరిఫికేషన్, వాటర్ టాక్స్, రీసర్వే, పీజీఆర్ఎస్ వినతులపై కలెక్టర్ సమీక్షించారు. వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. రెండురోజుల వ్యవధిలో అన్ని గ్రామాల్లో పర్యటించి ఆక్రమిత భూముల వివరాలను అందజేయాలన్నారు. వీటిపై మరోసారి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో వేసిన లే-అవుట్‌లలో ఎన్ని స్థలాలు ఖాళీగా ఉన్నాయో గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. మీ పనితీరు ఆధారంగా బదిలీలు ఉంటాయన్నారు. సిఫారసులకు చోటులేదన్నారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, ఇన్‌చార్జి డీఆర్వో మురళీ, ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటేశ్వరరావు, సర్వే విభాగం ఏడీ రమణమూర్తి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సాగునీటిని సక్రమంగా అందించండి

●ఎమ్మెల్యే కళాను కోరిన కెల్ల రైతులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గుర్ల/రాజాం, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్ల గ్రామ పరిధిలోని బుచ్చన్న చెరువు, బ్రహ్మసాగరం, రేవడి భూమి చెరువు, నర్సిబందల నుంచి కెల్ల గెడ్డ కాలువ ద్వారా సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని కెల్ల రైతులు కోరారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే కళా వెంకటరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పొలాలకు తారకరామ తీర్థసాగర్ కాలువ తవ్వకాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కెల్ల గెడ్డ కాలువ ద్వారా సాగునీరు సక్రమంగా చేరేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకు సానుకూలంగా ఎమ్మెల్యే స్పందించారు. జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. తొందరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సన్యాసినాయుడు, కిలారి సూర్యనారాయణ, కర్రోతు గోవింద్, రాముడునాయుడు తదితరులు ఉన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలఅభిషేకం



పాలఅభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు

చీపురుపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండీయూ ఆపరేటర్లను తొలగించి డీలర్ల వ్యవస్థకు తిరిగి ప్రాణం పోసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి రేషన్ డీలర్లు గురువారం పాలఅభిషేకం చేశారు. పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని డీలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా చీపురుపల్లి డీలర్ల సంఘం అధ్యక్షుడు రుంకాన రామారావు మాట్లాడుతూ డీలర్ల ప్రతిష్ఠను కాపాడిన ముఖ్యమంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో గరివిడి, మెరకముడిదాం సంఘాల అధ్యక్షులు కుమిలి జనార్దన్, జయసింహనాయుడు, గౌరవ అధ్యక్షుడు వై.రాజగోపాల్‌నాయుడు, కెంగువ శ్రీనివాసరావు, పొట్నూరు కామేశ్వరరావు, సూరు సునీల్‌కుమార్, వారణాసి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీవో ఆశయ్య

చీపురుపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని చీపురుపల్లి ఇన్‌చార్జి ఆర్డీవో ఆశయ్య అన్నారు. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం లింగ నిర్ధారిత పరీక్షల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల నిష్పత్తిని పెంపుదల చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో చీపురుపల్లి ఉప వైద్య ఆరోగ్య అధికారి ఎన్.సూర్యానారాయణ, గరివిడి ఎస్ఐ లోకేశ్, వైద్యులు రమేష్ కృష్ణ, అర్చన, మానవ హక్కుల ప్రతినిధి వి.పద్మలత, ఆర్డీవో కార్యాలయ ఏవో ఈశ్వరమ్మ, చిన్నతల్లి, ఎం.చాముండేశ్వరి, పవన్, ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో సమస్యలు పరిష్కరించండి

మెరకముడిదాం, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలో రీసర్వే చేపడుతున్న గ్రామాల్లో సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించాలని చీపురుపల్లి ఆర్డీవో బి.ఆశయ్య మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమావేశమయ్యారు. రీసర్వే, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన ఫిర్యాదులపై సమీక్షించారు. సమావేశంలో తహసీల్దారు అజురఫీజాన్ పాల్గొన్నారు.

26లోగా ఇళ్లు పూర్తయ్యేలా చూడండి

విజయనగరం రింగ్‌రోడ్డు, మే 22 (ఆంధ్రజ్యోతి) :అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు ఈనెల 26లోగా పూర్తయ్యేలా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం గుంకలాం, కొండకరకం ప్రాంతాల్లో హౌసింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం కమిషనర్ మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న అదనపు లబ్ధిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మురళీ మోహన్, డీఈ రంగారావు, ఏఈ రామకృష్ణ ఉన్నారు.

తాగునీటిని పొదుపుగా వాడండి

విజయనగరం రింగ్‌రోడ్డు, మే 22 (ఆంధ్రజ్యోతి) : నగరవాసులు తాగునీటిను పొదుపుగా వాడుకోవాలని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సూచించారు. గురువారం వార్డు పర్యటనల్లో మయూరి జంక్షన్ ఏరియాలో సమస్యలను గుర్తించారు. పైపులైన్ లీకేజీలను గుర్తించి వాటిని సరిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు కార్పొరేటర్ జి.వి.రంగారావు, ఎంఈవో సత్యవతి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి

●సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులకు ప్రతిపాదనలు

●ఎమ్మెల్యే లోకం నాగమాధవి



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

డెంకాడ, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరు అందించేందుకు ఇరిగేషన్ ప్రాజెక్టుల అభివృద్ధికి ఆదేశాలు జారీ చేశామన్నారు. గురువారం మండలంలోని డికొల్లం సమీపంలో గల చంపావతి మీడియం ప్రాజెక్టును ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డికొల్లం సమీపంలోని చంపావతి నదిలో గల మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు వల్ల సుమారు 36 గ్రామాల పరిధిలోని 5350 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉందన్నారు. ఐదేళ్లలో కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో సాగునీరు గగనమైందన్నారు. ఖరీఫ్ నేపథ్యంలో ప్రాజెక్టు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆమెతో పాటు పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, ఎంపీపీ బి.వాసుదేవరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కంది సూర్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, బీజేపీ ఇన్‌చార్జి బూర్ల శ్రీధర్, అభ్యుదయ రైతు పాణిరాజు, జనసేన నాయకులు సిరికి అప్పారావు, పైల శంకరరావు, ఎంపీడీవో భవాని తదితరులు పాల్గొన్నారు.

పాత డిజైన్ కొనసాగింపునకు చర్యలు

డెంకాడ, మే 22(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో తారకరామ తీర్థసాగర్ కుడి కాలువ డిజైన్‌ను రియల్ ఎస్టేట్ వెంచర్ యాజమాన్యానికి అనుకూలంగా మార్పులు చేసి గుణుపూర్‌పేట రైతులకు తీరని అన్యాయం చేశారని ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆరోపించారు. గుణుపూర్‌పేట గ్రామానికి చెందిన సుమారు 500 ఎకరాల రైతులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన నేపథ్యంలో ఆమె స్పందించారు. గురువారం మండలంలోని గుణుపూరుపేట రైతులతో కలిసి ఎమ్మెల్యే. తారక రామ తీర్థసాగర్ కుడి కాలువ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ రైతులకు అన్యాయం జరిగే పని ప్రభుత్వం చేపట్టదన్నారు. తారకరామతీర్థ సాగర్ కుడి కాలువ పాత డిజైన్ కొనసాగింపునకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి స్తానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కంది చంద్రశేఖరరావు, బీజేపీ నాయకుడు శ్రీధర్, పల్లె భాస్కరరావు, పాణిరాజు, తుమ్మో అప్పలరాజు దొర, పైల శంకరరావు, ఎంపీపీ బి.వాసుదేవరావు, గుణుపూరుపేట రైతులు పాల్గొన్నారు.

ఉగ్రవాద కార్యకలాపాలపై నిఘా పెంచాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

విజయనగరం దాసన్నపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉగ్రవాద కార్యకలాపాలపై జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారని తక్షణమే పోలీసు అధికారులు నిఘా పెంచాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌వర్మ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరాజ్ ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఓటర్ల జాబితాలో కూడా కొత్త పేర్లు ఉన్నాయన్నారు. పోలీసులు మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని మాట్లాడుతూ ప్రశాంతమైన జిల్లాలో ఇటువంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మీనరసింహం, కుసుమంచి సుబ్బారావు, కోటగిరి నారాయణరావు తదితరులున్నారు.

పంట కాలువను కప్పేశారని ఫిర్యాదు



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

పూసపాటిరేగ, మే22 (ఆంధ్రజ్యోతి): మండలంలో చోడమ్మ అగ్రహారం పంచాయతీ పరిధిలో చరణ్ గ్రూప్ రియల్ ఎస్టేట్ వ్యాపారులు పంట కాలువను కప్పేశారని తహసీల్దారు గోవింద్‌కు రైతులు, గ్రామపెద్దలు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్లు 60-1ఎ, 60-2ఎ, 60-3ఎ, 60-4ఎలలో లే-అవుట్ నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ లే-అవుట్ పైన లక్ష్మణ చెరువు ఉందన్నారు. ఆ చెరువుకు సంబంధించిన సాగునీటి కాలువను పైప్‌లు వేసి కప్పేశారన్నారు. ఈ విషయంపై సంబంధిత యాజమాన్యం వద్దకు వెళ్లి అడుగగా తర్వాత తొలగిస్తామని చెబుతున్నారన్నారు. వర్షాలు పడితే చెరువు నిండి గ్రామం ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని తహసీల్దారును వారు కోరారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ వీఆర్వో, సర్వేయరును పంపించి విచారణ చేయిస్తానన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచ్ పిల్ల అప్పలనాయుడు, జమరాజు, గుడివాడ అప్పల నర్సయ్య తదితరులు ఉన్నారు.

ఇంకా పేరు మారలే..

●ఆర్బీకేలుగానే రైతు సేవాకేంద్రాలు



దేవుదళలో రైతు భరోసా కేంద్రంగానే..

రేగిడి, మే 22 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వ కొలువదీరి దాదాపు ఏడాది కాస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా ప్రభుత్వం మార్చింది. అయితే ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు మండలంలోని అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. ఇందుకు దేవుదళలో రైతు భరోసా కేంద్రం పేరును రైతు సేవా కేంద్రంగా మార్చని తీరును ఉదాహరణగా చూపించవచ్చు. మండలంలో 25 రైతుసేవా కేంద్రాలు ఉండగా వాటిలో ఏడింటికి కొత్త భవనాలు ఉన్నాయి. నాలుగు చోట్ల అద్దె భవనాలు, కొన్ని పాత సచివాలయాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో ఇంకా అత్యధిక కార్యాలయాలు పాతపేరుతో కొనసాగుతున్నాయి. దీనిపై ఏవో మురళీకృష్ణ వివరణ కోరగా, రైతు సేవాకేంద్రాలుగా పేరు మార్చాలనే ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయన్నారు. వాటి కోసం నాలుగు మండలాలకు ఒక కాంట్రాక్టర్ రావల్సి ఉందన్నారు. పేరు మార్చే వరకూ ఆయా బోర్డులపై వైట్‌వాష్ వేయాల్సి ఉందన్నారు.

బంధువుల ఇంట పెళ్లికి వచ్చి..

●ఆటో బోల్తాపడి యువకుడి దుర్మరణం



రామకృష్ణ (ఫైల్)

తెర్లాం, మే 22(ఆంధ్రజ్యోతి):బంధువుల ఇంటికి వివాహానికి వచ్చిన ఓ యువకుడు ఆటో బోల్తా పడిన ఘటనలో దుర్మరణం పాలయ్యాడు. తెర్లాంలోని వేంకటేశ్వర కళాశాల వద్ద బుధవారం రాత్రి ప్రమాదం జరిగింది. ఎస్ఐ సాగర్ బాబు కథనం మేరకు.. గరివిడి మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన గెడ్డ రామకృష్ణ(24) ఐదురోజుల కిందట రాజయ్యపేటలోని తన బంధువులు ఇంట పెళ్లికి వెళ్లాడు. బుధవారం పెళ్లి అనంతరం సాయంత్రం మరో బంధువు ఎంఆర్ అగ్రహారంలో ఉండటంతో వారి ఇంటికి వెళ్లేందుకు అక్కడి నుంచి తన స్నేహితులతో ఆటోలో బయలుదేరాడు. అక్కడ రాత్రి భోజనం చేసిన తర్వాత వారిని కలిసి మళ్లీ రాజయ్యపేట వెళ్లేందుకు ఆటోలో పయనమయ్యాడు. తెర్లాం సమీపంలోగల వెంకటేశ్వర జూనియర్ కళాశాల వద్ద ఉన్న మలుపులో ఆటో బోల్తా పడింది. దాంతో అందులో ప్రయాణిస్తున్న రామకృష్ణ స్పృహ తప్పి కింద జారిపడ్డారు. ఆటో బోల్తాపడి రామకృష్ణపై పడింది. ఆటోను పైకి లేపేందుకు ఆటోలోని మరో వ్యక్తి ప్రయత్నించాడు. రోడ్డుపై ప్రయాణిస్తున్న వారితో కలిసి ఆటోపైకి ఎత్తేసరికి రామకృష్ణ కొన ఊపిరితో ఉన్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే రామకృష్ణ అప్పటికే మృతి చెందాడని అక్కడి వైద్యులు తెలిపారు. రామకృష్ణ తండ్రి ఎనిమిదేళ్ల కిందట మరణించాడు. రామకృష్ణ బతుకుతెరువు కోసం బైక్ మెకానిక్ పనులు చేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

●గరివిడి: మండలంలోని కోడూరుకు చెందిన గెడ్డ రామకృష్ణ (22) తెర్లాం మండలంలో బుధవారం రాత్రి జరిగిన ఆటో ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. మృతుడికి తల్లి సాయి, తమ్ముడు ఉన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

బాడంగి, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటి పల్లికి చెందిన ఉపాధి కూలీ చెల్లపురెడ్డి తవుడమ్మ (68) పనులు చేస్తుండగా మృతి చెందినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. గురువారం కోటిపల్లిలోని జగ్గన్న చెరువులో ఉపాధి పనిచేస్తూ సుమారు ఉదయం 8.30 గంటల సమయంలో పని ప్రదేశంలోనే ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడి మృతి చెందిందని చెప్పారు. తవుడమ్మకు కుమార్తె ఉందని తెలిపారు. గతంలో ఆమె భర్త మృతి చెందారని వివరించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గుర్ల, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలో కెల్ల గ్రామానికి చెందిన సువ్వాడ గాంధీ(32) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. రెండు రోజుల కిందట ఇంట్లో భార్యభర్తల మధ్య గొడవ జరిగింది.గాంధీ తాగుడుకు బానిసై నిత్యం ఇంట్లో గొడవ సృష్టించేవాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గడ్డి మందు తాగానని కుటుంబ సభ్యులకు తెలిపాడు. దాంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కూటీని ఢీకొన్న లారీ

●భార్యాభర్తలకు గాయాలు

భోగాపురం, మే22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహరాజపేట సమీపంలో రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో భోగాపురానికి చెందిన భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వారు ప్రయాణిస్తున్న స్కూటీని లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. భోగాపురం గ్రామానికి చెందిన భార్యాభర్తలు సింగిడి లక్ష్మి, అచ్యుతరావు బుధవారం రాత్రి స్కూటీపై భోగాపురం నుంచి తగరపువలస వెళ్తున్నారు. మహరాజపేటకు చేరుకునే సరికి విజయనగరం నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ స్కూటీని వెనుక నుంచి ఢీకొంది. దాంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం తగరపువలసలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు అచ్యుతరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.సూర్యకుమారి కేసు నమోదు చేశారు.

ఆలయాల్లో చోరీ

సాలూరు, మే 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డిగ్రీ కాలేజీ సమీపంలోని నూకాలమ్మతల్లి, సత్తెమ్మతల్లి, దేశమ్మతల్లి ఆలయాల్లోని బుధవారం రాత్రి చోరీలు జరిగాయి. హుండీలు, బీరువాల తాళాలను పగలగొట్టి సొత్తును అపహరించారు. ఆలయాల్లో చోరీ విషయంపై తమకు ఎవరు ఫిర్యాదు చేయలేదని పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు.

వ్యక్తికి గాయాలు

పాచిపెంట, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పనుకువలస వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధి హామీ పథకం టీఏ మురళికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఉద్యోగ రీత్యా అభివృద్ధి పనులు పరిశీలించి బైక్‌పై తిరిగి వస్తుండగా పనుకువలస వద్ద అతడు జారిపడ్డాడు. గాయపడిన మురళిని సాలూరు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ కె.వెంకట సురేష్ కేసు నమోదు చేశారు.

అధికారులపై చర్యలు తీసుకోండి

భోగాపురం, మే22 (ఆంధ్రజ్యోతి): బాధితులకు న్యాయం చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని చెరుకుపల్లికి చెందిన మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం స్థానిక మండల కార్యాలయాల సముదాయంలో వారు విలేకరులతో మాట్లాడారు. 12 మందికి ఇళ్ల పట్టాలను గత ప్రభుత్వం ఇచ్చిందన్నారు. న్యాయస్థానం అనుమతులు ఉన్నా స్థలాలు అప్పగించలేదన్నారు. దానిపై కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేయడంతో స్థలాలు అప్పగించాలని తహసీల్దారు సురేష్‌ను ఆదేశించారన్నారు. అయితే తహసీల్దారు స్పందించడం లేదన్నారు. ఇళ్ల పట్టాదారుల్లో గోక సీతాదేవికి స్థలం చూపిస్తామని తహసీల్దారు పదేపదే చెబుతున్నారే తప్ప స్థలం అప్పగించడం లేదన్నారు. సీతాదేవి దళిత సామాజికవర్గానికి చెందినవారు కావడంతో తహసీల్దారు అలా వ్యవహరించారన్నారు. ఈ విషయంలో తహసీల్దారుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని భోగాపురం పోలీసులను ఆశ్రయించినా వారు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ఇళ్ల స్థలాలు అప్పగింతకు చర్యలు చేపట్టాలన్నారు. లేకుంటే స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్.ఆదినారాయణ, గోక సీతాదేవి, టి.గురుమూర్తి, నరసింగరావు, టి.ఉదయకుమార్, బోర ఆదిలక్ష్మి, ఆర్.సూరితల్లి, రిక్కా పైడితల్లి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాల మేరకు సరకుల పంపిణీ

● బొబ్బిలిలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాల అభిషేకం



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పటాలకు పాల అభిషేకం చేస్తున్న డీలర్లు

బొబ్బిలి రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నుంచి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రేషన్ సరుకులను పక్కాగా పంపిణీ చేస్తామని బొబ్బిలి మండలంలోని డీలర్లు తెలిపారు. రేషన్ సరఫరాకు సంబంధించి ఎండీయూ వాహనాలను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బొబ్బిలి మండలంలోని రేషన్ దుకాణాల డీలర్లు హర్షం వ్యక్తంచేశారు. ఈమేరకు గురువారం బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చిత్రపటాలకు పాలఅభిషేకంచేశారు. కార్యక్రమంలో డివిజన్ రేషన్ సంఘం అధ్యక్షులు గేదెల సత్యనారాయణ, తెంటు సూర్యనారాయణ, గొట్టాపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బొబ్బిలి మునిసిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు తెలిపారు.ఈ మేరకు గురువారం బొబ్బిలి మునిసిపల్ కార్యాలయంలో డీలర్లసంఘం అధ్యక్షుడు గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో శరత్ బాబును అభినందించారు. కార్యక్రమంలో డివిజన్ రేషన్ సంఘం అధ్యక్షులు గేదెల సత్యనారాయణ, తెంటు సూర్యనారాయణ, గొట్టాపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎండీయూతో ప్రజాధనం దుర్వినియోగం

● డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాపు రామారావు

రామభద్రపురం, మే 22(ఆంధ్రజ్యోతి):గతప్రభుత్వం మోసపూరిత విధానాల వల్ల అన్ని వర్గాల ప్రజలతోపాటు డీలర్లు కూడా తీవ్రంగా నష్టపోయారని డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాపు రామారావు తెలిపారు. గురువారం రామభద్రపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి బియ్యం అందిస్తామని చెప్పిన ఆనాటి ప్రభుత్వం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని తెలిపారు. కొన్ని వందల కోట్లు ఖర్చుపెట్టి ఎండీయూ వ్యవస్థను తెచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ఈ ఎండీయు వ్యవస్థ వల్ల రేషన్ పక్కదారి పట్టడమే కాకుండా బ్లాక్‌మార్కెట్‌కు కూడా బియ్యం తరలించి ఆనాటి పాలకులు దోచుకున్నారని ఆరోపించారు. ఈ దోచుకున్న బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలించారని తెలిపారు. అప్పటి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ దారుణానికి ఒడిగట్టారని విమర్శించారు. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీలర్లపై నమ్మకం ఉంచి మళ్లీ వారితో బియ్యం అమ్మకాలు చేపట్టడంపై ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. డీలర్ల వ్యవస్థపై నమ్మకంఉంచిన ముఖ్యమంత్రి చంద్రబాబు , పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఉమాశంకర్, మండల డీలర్ల సంఘం నాయకులు మీసాల రాజినాయుడు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాలి: కమిషనర్

బొబ్బిలి రూరల్, మే22 (ఆంధ్రజ్యోతి):జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని బొబ్బిలి మునిపిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పిలుపునిచ్చారు.గురువారం బొబ్బిలిలో సబ్‌ట్రెజరీ కార్యాలయం ఆవరణలో ఎస్టీవో పీపీ పద్మనాభం అధ్వర్యంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం పురస్కరించుకుని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, సీనియర్ సహాయకులు టి.విజయం, జి.సుజాత పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో సత్తాచాటిన యశస్విని

బొబ్బిలి రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలోని పెంట గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి యశస్విని వ్యాసరచన పోటీల్లో సత్తాచాటింది. ఏపీ జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యం విజయవాడలో గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జోనల్‌స్థాయి ప్రథమ స్థానం స్థానంలో నిలిచిన పెంట గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి యశస్విని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు.



పవన్ కల్యాణ్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న యశస్విని

125 ఎకరాల్లో తోటల పెంపకానికి చర్యలు

● ఆరు వేల మందికి పనులు ● ఏపీవో త్రినాథరావు

రామభద్రపురం, మే 22(ఆంధ్రజ్యోతి):మండలంలో ఉపాధిహామీ పథకం కింద ఈఏడాది 125ఎకరాల్లో పండ్లతోటల పెంపకంచేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీవో గొలగాని త్రినాథరావు తెలిపారు. గురువారం రామభద్రపురం ఉపాధిహామీ పథకం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే 45 ఎకరాలు గుర్తించామని, ఈనెలాఖరులోగా మిగతా విస్తీర్ణం గుర్తిస్తామని చెప్పారు. 20 పంచాయతీల్లో ఈ పథకం వర్తిస్తుందని, ఇందులో భాగంగా మునగ, మామిడి, జీడి, కొబ్బరి, సపోటా, డ్రాగన్‌ఫ్రూట్ పండించనున్నామని తెలిపారు. పూలమొక్కల పెంపకం కింద గులాబీలు, మల్లెలు పెంచడానికి ఆసక్తిగల రైతుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. అలాగే మండలంలో ఈ ఏడాది 22 పంచాయతీల్లో ఆరు వేలమందికి ఉపాధి పనులు కల్పిస్తున్నామన్నారు. ఫాంపాండ్స్, చానల్, షోక్‌పిట్స్, రింగ్ ట్రెంచ్‌లు, ట్రెంచి కమ్ బండ్స్ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వేసవిలో పనిచేసేచోట సౌకర్యాల కల్పనకు కూడా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. సమావేశంలో ఈసీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

బొబ్బిలి రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో యుద్ధం స్తంభం వద్ద ట్రాఫిక్ ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం ముమ్మరంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను తనిఖీ చేసి వాటి పత్రాలను, వాహనాల్లో ఉన్న సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ వాహనానికిసంబంధించిన పత్రాలు వాహన చోదకులు కలిగి ఉండాలని, సరైన పత్రాలు లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రీసర్వే వినతులు పరిష్కరించాలి

● నీటి పన్ను వసూలుకు వారం వారీ లక్ష్యాలు
● జేసీ సేతు మాధవన్

బొబ్బిలి/రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రీసర్వే వినతులన్నీ వారంరోజుల్లో పరిష్కారం కావాలని జాయింట్‌కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. అర్జీల డిస్పోజ్ చేయడం ముఖ్యంకాదని, పరిష్కారం కావాలని స్పష్టంచేశారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చే వినతుల్లో 90 శాతం వరకు రెవెన్యూకు సంబంధించినవే వస్తున్నాయని తెలిపారు. గురువారం బొబ్బిలిలో అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాల రెవెన్యూ అధికారులతో జేసీ మాధవన్ ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, అందరికీ గృహాలు, ఇళ్ల స్థలాల రీవెరిఫికేషన్, వాటర్ టాక్స్, ఆన్‌లైన్ సర్వీసెస్ పెండింగ్, రీసర్వే, పీజీఆర్ఎస్ వినతులపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలాల క్రమబద్ధీకరణ కోసం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఆక్రమణదారులతో దరఖాస్తులు పెట్టించాలని, అందుకోసం వీఆర్వోలు క్షేత్రస్థాయిలో ఇంటింటికి సందర్శించాలని తెలిపారు. రెండు రోజుల గడువులో అన్నిగ్రామాల్లో పర్యటించి ఆక్రమిత భూముల వివరాలను నమోదు చేయాలని సూచించారు. వచ్చే సోమవారం నుంచి ఈ విషయంపై వినతులు అందితే సంబంధిత వీఆర్వోపై చర్యలు తీసుకుంటామన్నారు. అందరికీ ఇళ్లు పథకం కింద జిల్లాలో ఆరు వేల దరఖాస్తులు అందాయని, వీటిని వెరిఫై చేసి శనివారం నాటికి ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. రీసర్వేలో జరిగిన తప్పిదాలను సవరించాలని, వెబ్‌లాండ్‌లో ఒకరి పేరుంటే



మాట్లాడుతున్నసేతు మాధవన్

పొజిషన్‌లో ఇంకొకరి పేరు ఉందన్నారు. డాక్యుమెంట్‌లను వెరిఫై చేయకుండా తప్పులుగా నమోదు చేశారని ఆగ్రహంవ్యక్తంచేశారు. రీసర్వేపై వచ్చిన వినతులను మండలాల వారీగా జాబితా ఇవ్వనున్నట్లు తెలిపారు. వాటర్ టాక్స్ జిల్లాలో సుమారుగా 10 కోట్ల రూపాయల వరకు వసూలు చేయవలసి ఉండగా కేవలం 53 వేల రూపాయలను మాత్రమే వసూలు చేశారని, ఇకపై వారం వారం లక్ష్యాలను నిర్దేశిస్తామని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో జీవీఎస్ రామ్మోహనరావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రమణమూర్తి, నియోజకవర్గానికి చెందిన తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, డీటీలు పాల్గొన్నారు.

నిరుద్యోగుల్లో నిరాశ

(ఐదో పేజీ తరువాయి)

మంజూరు చేశారు. దీనిపై ఇన్‌చార్జి కలెక్టర్ హోదాలో సేతు మాధవన్ ఇటీవల అధికారుల వద్ద అసహనం వ్యక్తం చేశారు. కాగా జిల్లాలో బీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాల కోసం 20,449 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 3300యూనిట్లకు వీరంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కూడా పూర్తయింది. ఎంపీడీవోల లాగిన్ నుంచి 2140 దరఖాస్తులను బ్యాంకర్లకు పంపించారు. బ్యాంకర్లు 520 దరఖాస్తులను కలెక్టర్ లాగిన్‌కి పంపించారు. ప్రభుత్వం నుంచి రాయితీ విడుదల కాక బ్యాంకర్లు ఎవరికీ రుణాలు ఇవ్వలేదు.

యువత స్వయం ఉపాధికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు చెబుతున్నా ఆచరణ చూస్తే మరోలా ఉంది. ప్రభుత్వం నుంచి సహకారం లేదు. రాయితీ అందక నిరుద్యోగులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకున్నప్పుడు ఎంతో ప్రయాస పడ్డారు. అధికారులకు, బ్యాంకులకు అనేక ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వీటిని పొందడానికి డబ్బులు సైతం ఖర్చు పెట్టారు. ఇంత ప్రయాస పడినా రుణం, రాయితీ ఎప్పుడు అందుతుందో తెలియని దుస్థితి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఈజీపీ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ముందుగా డీఐసీ, కేవీఐబీ, కేవీఐసీ ఏజెన్సీలను సంప్రదించాలి. ఆపై పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ పథకం మంజూరైతే లక్ష రూపాయలకు రూ.35వేలను ప్రభుత్వం రాయితీగా అందిస్తుంది. బ్యాంకు మేనేజర్ విల్లింగ్ ఇవ్వాలి. ఆ తర్వాత దరఖాస్తు దారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం కార్మిక శాఖ నుంచి(లేబర్) సర్టిఫికెట్ తీసుకోవాలి. ఆపై ఏ యూనిట్ ఏర్పాటు చేస్తారో దానికి కొటేషన్ తీసుకురావాల్సి ఉంటుంది. అంతా ప్రక్రియ ముగిసిన తరువాత నోటరీ చేసి బ్యాంకుకు అందజేస్తే మేనేజర్ రుణం మంజూరు చేస్తారు. రుణం ఇచ్చిన తరువాత రూ.100కి రూపాయి 20 పైసలు చొప్పున బ్యాంకు వడ్డీ చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఎప్పుడు రాయితీ విడుదల చేస్తే అప్పుడు లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో ఆ డబ్బులను జమ చేస్తారు. అప్పటి వరకూ మొత్తం తీసుకున్న రుణాన్ని నెలవారీ వాయిదాల రూపంలో చెల్లించాలి. ప్రభుత్వం నుంచి రాయితీ విడుదల కాక లబ్ధిదారులు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. ఇదే విషయాన్ని జిల్లా పరిశ్రమల విభాగం ఇన్‌చార్జి మేనేజరు సుధీర్ వద్ద ప్రస్తావించగా కేంద్ర ప్రభుత్వం మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యాల కంటే ఎక్కువ సంఖ్యలో రుణాలను మంజూరు చేశామని, అయితే కేంద్ర ప్రభుత్వం మార్చి నెల నుంచి పీఎంఈజీపీ పోర్టల్ నిలిపివేసిందన్నారు. మళ్లీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేగాని తాము ఏమీ చెప్పలేమని వెల్లడించారు. ఈ పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వమైనా రుణాలు ఇచ్చి.. రాయితీ విడుదల చేసి ఆదుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

రోడ్లకు కొత్త రూపు

(ఐదో పేజీ తరువాయి)

ఆపేశారు. మరికొన్ని రోడ్లకు కనీసం మరమ్మతులు చేపట్టలేదు. జిల్లాలో గ్రామీణ లింకు రోడ్లుకు ఆర్‌అండ్‌బి రోడ్లు అనుసంధానంగా ఉంటాయి. జాతీయ రహదారులకు కూడా కలుపుకొని ఉంటాయి. ఎక్కడి నుంచి ఎక్కడకు వెళ్లాలన్నా ఈ రోడ్లను ఆశ్రయించకతప్పదు. స్టోన్ క్రషర్, ఇతర భారీ సామగ్రిని తీసుకెళ్లే వాహనాలు పరిమితికి మించిన బరువుతో తిరగడంతో రోడ్లు మరింత శిథిలమయ్యాయి. ఈ రోడ్లను బాగు చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం నడం బిగించింది. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖకు చెందిన 64.71 కిలోమీటర్ల పొడవు కలిగిన 19 రోడ్ల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.24.92 కోట్లు అందించింది.వీటికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, జిల్లాపరిషత్ అనే తేడాలేకుండా పాడైన రోడ్లతో పాటు విస్తరించాల్సిన రోడ్లుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. ప్రాధాన్యత క్రమంలో రోడ్లను అభివృద్ధి చేసే ప్రయత్నం జరుగుతోంది.

పేలుళ్లకు కుట్ర?

(ఐదో పేజీ తరువాయి)

నిజాలు తెలిశాయి. ఆ వెంటనే అప్రమత్తమైన అధికారులు సిరాజ్ వద్ద ఉన్న పేలుళ్ల సామగ్రిని స్వాధీనం చేసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 17 నుంచి నగరంలో వివిధ ప్రాంతాల్లో సోదాలు చేశారు. అనుమానం వచ్చిన ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశీలించి మరిన్ని క్లూలు సేకరిస్తూ వస్తున్నారు. వీరికి తోడుగా జిల్లా పోలీస్ యంత్రాంగం సిరాజ్ కుటుంబీకులతో పాటు స్కూల్ వయసు నుంచి అతనితో పరిచయం ఉన్న స్నేహితుల వివరాలపై ఆరా తీస్తున్నారు. మొత్తం ఎపిసోడ్‌లో దర్యాప్తు అధికారులు, ఆంధ్రా , తెలంగాణ కౌంటర్ ఇంటిలిజెన్స్ అధికారులు, స్థానిక పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. సిరాజ్ పలువురితో ప్రత్యేక కోడ్ భాషలో మాట్లాడుతున్నట్లు కూడా గుర్తించారు.

● సిరాజ్ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు తెలిశాక ఎన్ఐఏ అధికారులు ఢిల్లీ నుంచే ఆపరేషన్ మొదలు పెట్టారు ఆపై ఆంధ్రా, తెలంగాణలో విధులు నిర్వహించే ఆ సంస్థ అధికారులు నగరానికి వచ్చి వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ సమాచారం సేకరిస్తున్నారు. జిల్లా కేంద్రంలో సిరాజ్‌కు ఎవరైనా సహకరించారా అనేదీ ఆరా తీస్తున్నారు. స్థానికంగా సిరాజ్‌కు పేలుడు సామగ్రిని అమ్మిన వ్యాపారులతో ఇప్పటికే మాట్లాడారని తెలిసింది.

ఆరేళ్లుగా ఎదురుచూపు

(ఐదో పేజీ తరువాయి)

1,20,225 మందికి రూ.102.83 కోట్లు అందించినట్టు అధికారులు చెబుతున్నారు. వడ్డీ కాకుండా అసలు చెల్లించారు. వీరిలోనూ చాలామందికి నగదు అందలేదు. దీంతో అప్పట్లో మళ్లీ ఆందోళనలు కొనసాగాయి. రూ.20 వేలకు మించి రూ.లక్షలోపు డిపాజిట్ చేసిన వారికి రూ.10 వేలు అందించినట్టు అధికారులు చెబుతున్నారు. రెండుకు మించి బాండ్లు ఉన్నవారిని అసలు పరిగణనలోకి తీసుకోలేదు. డిపాజిట్లు కట్టి మోసపోయిన పదుల సంఖ్యలో బాధితులు చనిపోయారు. కొందరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. మన్యం జిల్లాతో పోల్చుకుంటే రూ.20 వేల నుంచి రూ.లక్ష కట్టిన డిపాజిటుదార్లు విజయనగరం జిల్లాలో చాలా ఎక్కువ. సీఐడీ ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను విక్రయించి అందిస్తామని జగన్ ప్రకటించారు కానీ అది ప్రకటనగానే మిగిలిపోయింది.

పనితీరు ఆధారంగానే బదిలీలు

(ఐదో పేజీ తరువాయి)

సంబంధించినవేనని, రెవెన్యూ అధికారులే ఇందుకు కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో చేపట్టే బదిలీల్లో పనితీరుకే ప్రాధాన్యం ఇస్తామన్నారు. భూవివాదాలపై మాట్లాడుతూ ఆక్రమితదారులతో దరఖాస్తులను పెట్టించాలని, అందుకు కోసం వీఆర్‌వోలు క్షేత్రస్థాయిలో ఇంటింటినీ సందర్శించాలని ఆదేశించారు. రెండు రోజుల్లో అన్ని గ్రామాల్లో పర్యటించి ఆక్రమిత భూముల వివరాలను నమోదు చేయాలని సూచించారు. వచ్చే సోమవారం నుంచి ఈ విషయంపై వినతులు అందితే సంబంధిత వీఆర్‌వోపై చర్యలు తీసుకుంటామన్నారు. అందరికీ గృహ పథకం కింద జిల్లాలో ఆరు వేల దరఖాస్తులు అందాయని, వీటిని పరిశీలించి శనివారంనాటికి ఆన్‌లైన్ చేయాలన్నారు.రీసర్వేలో జరిగిన తప్పి దాలను సవరించాలని, వెబ్‌ల్యాండ్ ఒకరి పేరుంటే, పొజిషన్‌లో మరొకరి పేరు ఉందని, డ్యాకుమెంట్‌లను పరిశీలించకుండా తప్పులుతప్పులుగా నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.రీసర్వేలో వచ్చిన వినతులపై మండలాల వారీగా జాబితా ఇస్తామని, వీటిని పరిశీలించి వారంలోగా మొత్తం పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో నీటి తీరువా రూ.10 కోట్ల వరకూ బకాయి ఉందని, కేవలం రూ.53 వేలు వసూలు చేశారని, ఇక నుంచి ప్రతి వారం లక్ష్యాలను నిర్దేశించాలని జేసీకి సూచించారు. సమీక్షలో ఇన్‌చార్జి డీఆర్‌వో మురళి, ఇన్‌చార్జి ఆర్‌డీవో వెంకటేశ్వరరావు, ల్యాండ్ సర్వే ఏడీ రమణమూర్తి, తహసీల్దార్లు , వీఆర్‌వోలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

పార్వతీపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు గిరిజన కార్పొరేషన్ (జీసీసీ) ద్వారా మెరుగైన సేవలందించాలని జీసీసీ చైర్మన్ శ్రావణ్ కోరారు. గురువారం పార్వతీపురంలోని జీసీసీ డీఎం కార్యాలయంలో జీసీసీ అధి కారులతో శ్రావణ్ సమీక్షించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడా ఎటువంటి లోపాలు ఉండరాదని, గిరిజనులకు సేవలందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, మహేంద్ర, రామారావు పాల్గొన్నారు.

కేసీసీ రుణాలపై స్పందించాలి

● లక్ష్యాలను అధిగమించేందుకు దృష్టి సారించాలి: కలెక్టర్ శ్యాం ప్రసాద్

పార్వతీపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కిసాన్ క్రెడిట్ కార్డులు(జీసీసీ) రుణాలపై బ్యాంకర్లు తక్షణమే స్పందించకపోతే ఉపేక్షించబోమని కలెక్టర్ శ్యాం ప్రసాద్ స్పష్టంచేశారు. కేసీసీలో వచ్చిన దరఖాస్తులపై 15 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాంకర్లకు నిర్దేశించిన లక్ష్యాలు సకాలంలో సాధించాలని, అందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గురువారం పార్వ తీపురం కలెక్టర్ కార్యాలయంలో బ్యాంకు అధికారులు, పలు శాఖల అధికారులతో డీసీసీ అండ్ జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2024 సంవత్సరానికి తీసుకున్న పంట రుణాలు తిరిగి చెల్లించిన రైతులకు ఈ ఏడాది రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ పథకం కింద యువత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ఊతమివ్వాలన్నారు. ప్రధా నమంత్రి స్వానిధి, మత్స్యకారుల వీధి వ్యాపారాలకు రుణాలు, ము ద్రా రుణాలు మంజూరులో కొన్ని బ్యాంకులు వెనుకబడి ఉండడంతో త్వరితగతిన లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జూన్ 21 వరకు యోగాంధ్ర కార్య క్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ శోభిక, ఐటీడీఏ ప్రా జెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత పాల్గొన్నారు.

సీతంపేటలో పీజీఆర్ఎస్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం సీతంపేటలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు నుంచి సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నాణ్యమైన జీడిపిక్కలను కొనుగోలు చేయాలి

నాణ్యమైన జీడిపిక్కలను కొనుగోలు చేయాలని, బ్రాండింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ కోరారు.పార్వతీపురంలోని మార్కెట్ యార్డులో జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డీఆర్వో కె.హేమలత, గిరిజన సంక్షేమశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ మణిరాజ్, ఏపీవో మురళీధర్, ఉన్నారు.

ఈవీఎం గోదాము తనిఖీ

పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఈవీఎం గోదామును కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తనిఖీ చేశారు.గోదాములకు వేసిన సీళ్లను, ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాటును పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకంచేశారు. కార్యక్రమంలో డీఆర్వో కె.హేమలత, తహశీల్దార్ వై.జయలక్ష్మి పాల్గొన్నారు.

పినపెంకిలో కొట్లాట

బాడంగి, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పినపెంకిలో బుధవారం సాయంత్రం జరిగిన కొట్లాటలో నలుగురికి గాయాలు కావాడంతో సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. పురుషులు ఇళ్లలో లేని సమయంలో బెవరవీధికి చెందిన వారు చాకలివీధిలో నివాసముంటున్న వీరిపై దాడిచేసినట్లు బాధితురాలు పోలమ్మ తెలిపారు. పోలమ్మ అభ్యర్థన మేరకు ఆమె మరిది వెంపడాపు రమేష్ గురువారం స్థానిక పోలీసులకు దాడిచేసిన వారిపై ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ మేరకు సీహెచ్ అరుణ, ఎస్.సీత, వి.రమేష్, గుగ్గిల పోలమ్మలకు గాయాలయ్యాయి. నలుగురిలో ఇద్దరు డిస్చార్జ్ కాగా రమేష్,పోలమ్మ చికిత్స పొందుతున్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

బొబ్బిలి రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): యోగా ప్రతి వ్యక్తి జీవితంలో ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు కావల్సిన స్థిరత్వాన్ని అందిస్తుందని కోమటిపల్లి ఆయుర్వేద ఆసుపత్రి వైద్యురాలు కనకమహాలక్ష్మి తెలిపారు. బొబ్బిలిలో ఎంపీడీవో పి.రవికుమార్‌తో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో యోగా విద్యపై విస్తృతంగా ప్రచారం చేసి యోగాతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు విశదీకరించాలన్నారు.సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, ఏవో డివి అప్పారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌సరఫరాకు అంతరాయం

బాడంగి, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గజరాయనివలస సబ్ స్టేషన్ పరిధిలో గల బాడంగి హెడ్ క్వార్టర్ ఫీడర్‌లోగల బాడంగి, డొంకినవలస రైల్వే స్టేషన్, ముగడ న్యూకాలనీ, మల్లంపేట సన్‌ప్రాం కోల్డ్‌ప్రాంకిలకు శుక్రవారం ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయంకలుగుతుందని ఆ శాఖ సిబ్బంది తెలిపారు. ఆయాగ్రామాల్లో ఉన్న చెట్టు కొమ్మలను తొలగించడానికి సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.